# దళారుల నయా దందా!

- ప్రభుత్వ పథకాల పేరిట డబ్బుల డిమాండ్
- దరఖాస్తుదారులకు దళారుల మాయమాటలు

**రేగొండ :** మీకు ప్రభుత్వం ద్వారా రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు కావాలా.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అందాలా.. అయితే అడిగినంతా ఇస్తే మీ పేరుపై పథకాలు మంజూరు చేయిస్తామంటూ దళారులు నయాదందాకు తెరలేపారు. దీంతో నిజమని నమ్మినా అమాయకులు అడిగినంత చదివిస్తూ మోసపోతున్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలు దళారులకు కాసుల పంట పండిస్తున్నాయి. లబ్ధిదారులుగా ఎంపిక చేస్తామంటూ దరఖాస్తుదారుల నుంచి అక్రమంగా డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరు చేయిస్తామంటూ కొంత మంది దళారులు వసూళ్ల దందాకు తెర లేపారు. దళారులుగా వ్యవహరిస్తున్న వారు రాజకీయ పార్టీల్లో తిరుగుతూ ముఖ్య నాయకులకు అనుచరులుగా వ్యవహరిస్తుంటారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులతో ఫొటోలు దిగుతూ సోషల్ మీడియాలో పెడుతుంటారు. వారితో ఎంతో పరిచయం ఉన్నట్లు ప్రచారం చేసుకుంటూ ఆదాయ మార్గాలుగా మార్చుకుంటున్నారు. వీరి మాటలను నమ్మి ప్రభుత్వ పథకాల్లో లబ్ధిపొందాలనే ఆత్రుతతో పలువురు రూ.వేలల్లో సమర్పించుకుంటున్నారు.



రేగొండ మండల పరిషత్ కార్యాలయం

**పైసలిస్తేనే పథకాల మంజూరు**

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో మంజూరైన దళితబంధు, బీసీబంధు, డబుల్ బెడ్రూం ఇళ్లు స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు చోటా మోటా నాయకులకు కాసుల వర్షం కురిపించాయి. దళిత బంధు, డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు కోసం ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. బీసీ బంధులో రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు దర్జాగా వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. కొన్ని గ్రామాల్లో రెండో దఫాలో దళిత బంధు ఇప్పిస్తామంటూ వసూలు చేసిన డబ్బులు తిరిగి లబ్ధిదారులకు ఇచ్చేయాల్సి వచ్చింది.

**దళారులను నమ్మి మోసపోవద్దు**



ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇప్పిస్తామని దళారుల చెప్పే మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దు. మంత్రి, ఎమ్మెల్యే, అధికారుల పేర్లు చెప్పి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఇవ్వొద్దు. ప్రభుత్వ నిబంధనల మేరకు సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేస్తాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ, రేగొండ

## క్లుప్తంగా

### సన్మానం



**టేకుమట్ల :** బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో సభ్యత్వం పొందిన గాదె భిక్షపతి నేటి యువతకు ఆదర్శమని అడిషనల్ రిటైర్డ్ ఎస్పీ పుల్ల సంజీవరావు, సినీ గేయ రచయిత మిట్టపెల్లి సురేందర్ అన్నారు. బుధవారం మండలంలోని రాఘవరెడ్డిపేటలో భిక్షపతిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడారు. భవిష్యత్‌లో సమాజం కోసం మరింత సేవలను అందిస్తూ ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరారు. సంగి రవి, దొంతుల శ్రీనివాస్, విజయబంగారి, పుల్ల సతీష్, సంగి రవివర్మ, దూడపాక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌గా అనిల్



**పలిమెల :** పలిమెల నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న మోదావత్ అనిల్‌కు పూర్తి స్థాయి తహసీల్దార్ (ఎఫ్‌ఏసీ)గా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సస్పెండ్ కాగా అనిల్‌ను తహసీల్దార్‌గా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

### తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

**కాటారం :** వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు నివారణ చర్యలు చేపడుతున్నట్లు ఎంపీఓ వీరస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రాజశేఖర్ తెలిపారు. తాగునీటి సరఫరా స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అధికారులు బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, చేతి పంపులు, ఇతరాత్ర తాగునీటి పథకాల పనితీరుపై ఆరా తీశారు. తాగునీటి పథకాల వద్ద పరిశుభ్రంగా ఉండేలా, పైపులైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలని గ్రామ పంచాయతీ, మిషన్ భగీరథ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీఓ, ఏఈఈ వెంట ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

### వైద్యశిబిరం



**మొగుళ్లపల్లి :** మండలంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర పాఠశాలలో బుధవారం పీహెచ్‌సీ వైద్యాధికారి నాగరాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి విద్యార్థులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, ప్రిన్సిపాల్ శారద, హెల్త్ సూపర్‌వైజర్ సునీత, ఏఎన్‌ఎం శ్రీలత, స్టాఫ్‌నర్స్ అస్త, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు ఉన్నారు.


### ట్రాక్టర్ బోల్తా, డ్రైవర్ మృతి



వీరాచారి మృతదేహం

**గణపురం :** ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడడంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని పరుశురాంపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రవినగర్ గ్రామానికి చెందిన బసవోజు వీరాచారి(45) పరుశురాంపల్లి ఓసీ-3లో ఓ కాంట్రాక్టర్ వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రోజులాగే విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కనే గల లోయలో బోల్తా పడడంతో డ్రైవర్ వీరాచారి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కాగా ట్రాక్టర్ ట్రాలీలో ఉన్న కూలీలు ట్రాలీ నుంచి కిందికి దూకడంతో ప్రాణాలతో బయటపడ్డారని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై రేఖఅశోక్ ఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు చేసి, కేసు నమోదు చేశారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కటుంబానికి చెందిన వీరాచారి మృతితో రవినగర్ విషాదచాయలు అలుముకున్నాయి.

### ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య



చంద్రయ్య (ఫైల్)

**కాళేశ్వరం :** మహదేవపూర్ మండల కేంద్రంలోని నర్సరీ వద్ద ఒంటరితనాన్ని తట్టుకోలేక జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు బలిజే చంద్రయ్య (65) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జనగామ జిల్లా రఘునాథపల్లికి చెందిన చంద్రయ్య తన భార్యలేదని, జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుమారుడు జితేందర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

**టేకుమట్ల :** తమ పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా మండలంలోని మాజీ సర్పంచ్‌లను బుధవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్‌లను అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. పెండింగ్ బిల్లులు రాక సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకునే స్థాయికి చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు దఫాలుగా రాష్ట్ర మంత్రి సీతక్కతో పాటు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సైతం వినతిపత్రాలను అందజేసినా ఫలితం శూన్యమన్నారు. ఇప్పటికైనా పెండింగ్ బిల్లులను చెల్లించి ఆదుకోవాలని వేడుకున్నారు. అరెస్టు అయిన వారిలో నేరేళ్ల శ్రీనివాస్, గునిగంటి మహేందర్, బిల్లకంటి ఉమేందర్‌రావు, ఉద్దమారి మహేష్‌యాదవ్, పండుగ శ్రీను, తదితరులు ఉన్నారు.



పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

# యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

- అడ్డుకున్న సీపీఎం నాయకులు

**వాజేడు :** మండల సరిహద్దులో యథేచ్ఛగా మైనింగ్ (గ్రావెల్) తవ్వకాలు నిర్వహిస్తున్నారు. దీంతో సీపీఎం నాయకులు బుధవారం మైనింగ్ తవ్వకాలను అడ్డుకున్నారు. ఏటూరునాగారం మండలంలోని ఇసుక క్వారీకి గ్రావెల్ తవ్వకాలను వాజేడు మండలం నుంచి చేపట్టారు. పట్టాభూమికి అనుమతి తీసుకుని ప్రభుత్వ భూమిలో నుంచి గ్రావెల్ తవ్వకాలను చేస్తుండడంతో సీపీఎం నాయకులు కొప్పుల రఘుపతి రావు, గుగ్గిళ్ల దేవయ్య, దామోదర్, బచ్చలి కృష్ణ బాబు, పూనెం కృష్ణ బాబు గ్రావెల్ తవ్వకం పనులను అడ్డుకున్నారు.విషయం తెలుకున్న పోలీసులు, తహసీల్దార్, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. 1/70, పీసా చట్టాలు ఉన్నప్పటికీ వాటిని ఎలా అమలు చేస్తారని అధికారులను వారు ప్రశ్నించారు.

**మైనింగ్ తరలింపును అడ్డుకోవాలి**

అక్రమంగా మైనింగ్ (గ్రావెల్) తరలింపును వెంటనే అడ్డుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జెజ్జరి దామోదర్ మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70, పెసా చట్టాలను అధికారులు తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. అక్రమంగా అనుమతులను ఇస్తూ ఏజెన్సీ సంపదను కొల్లగొట్టేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెసా గ్రామసభ లేకుండా మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు ఎలా అనుమతి ఇస్తారని విమర్శించారు. ముత్తయ్య, కృష్ణ బాబు, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.



గ్రావెల్ తవ్వకాలను అడ్డుకుంటున్న నాయకులు

# ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ మల్లేశం

**ములుగు :** విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం సూచించారు. ఈ మేరకు కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవాలని తెలిపారు. సఖి సెంటర్ సీఈఓ సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులు స్వయం ఉపాధి, వ్యాపార నైపుణ్యాలు, ఉత్పత్తి సేవల మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలయ్య, అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్, టీఎస్‌కేసీ కన్వీనర్ కవిత, అధ్యాపకులు సరిత, శిరీష, రాధిక, అనిల్‌కుమార్, జగదీశ్, ఉదయశ్రీ, విజిత, తేజోలత, మౌలానా, అనిత, నవీన్, ఐలయ్య, లక్ష్మి, షరీఫా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


# ప్రభుత్వ భూములను కాపాడాలి

**వెంకటాపురం(కె) :** మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70 చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి వలస గిరిజనేతరులు బహుళ అంతస్తులను నిర్మించడంతో పాటు క్రయ, విక్రయాలను చేస్తున్నట్లు ఆరోపించారు. నూగూరు(జి) సర్వే నెంబర్ 23/1 పై సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించాలని కోరారు. వెంకటాపురం(జెడ్)లోని సర్వే నంబర్ 68, 69 లోని ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా గిరిజనేతరులు, నాయకులు, అధికారుల అండదండలతో బహుళ అంతస్తులను నిర్మిస్తున్నారని వెల్లడించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో తుర్స కృష్ణ బాబు, తాటి రాంబాబు, బొగ్గల రాజ్‌కుమార్, వినోద్, అర్జున్, నాగరాజు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

# ఘనంగా స్వయంపాలన దినోత్సవం



**ములుగు రూరల్ :** మండలంలోని జగ్గన్నపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులుగా విద్యాబోధన చేశారు. ఐటీడీఏ పీఓగా శశికళ, డీడీగా వెన్నెల, ఏటీడీఓగా సుకన్య, వార్డెన్‌గా హారిక వ్యవహరించారు. ఉపాధ్యాయ పాత్రల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు లక్ష్మి, రమాదేవి, బన్సీలాల్, జయరాం, రాజు, సృజన, పూర్ణబాయి, సుశీల, వార్డెన్ అనిత తదితరులు పాల్గొన్నారు.

### వర్గీకరణ నిర్ణయం చరిత్రాత్మకం

**ములుగు :** ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలుపుతూ సానుకూల నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకం అని ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మట్టివాడ తిరుపతి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు అండగా నిలవలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపడం సంతోషకరమని అన్నారు.

# నిరుద్యోగ యువతకు అవగాహన

**కాటారం :** నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన మెరుగుపర్చడంలో భాగంగా బుధవారం మండలంలోని దేవరాంపల్లి బేతేస్థ ప్రార్థన మందిరంలో సేవా భారత్ ఆధ్వర్యంలో హెల్త్ ఎడ్యుకేషన్, స్వయం ఉపాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి మార్గాలు పెంపొందించుకోవడంపై యువతకు పలు సూచనలు సలహాలు అందజేశారు. స్వయం ఉపాధి కోసం జెండుబామ్, సర్ఫ్, షాంపూ, పలు రకాల తైలాలు విక్రయించడం కోసం యువతకు అందజేశారు. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని రాజరాజేశ్వర ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామస్తులకు వ్యాధులు, నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, సేవా భారత్ ప్రతినిధి ప్రవీణ్, పాస్టర్ రవీందర్, రవిప్రసాద్, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఉత్పత్తులు అందజేస్తున్న డాక్టర్ రమేశ్

# ఎన్నికలకు సహకరించండి

**రేగొండ :** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కొత్తపల్లిగోరి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాంప్రసాదరావు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో అఖిల పక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని కొనరావుపేట, చిన్నకోడేపాక గ్రామ పంచాయతీలు, నూతనంగా ఏర్పడ్డ బాలయ్యపల్లి, కొత్తపల్లి (కే) గ్రామపంచాయతీల్లో ప్రచురణ చేసిన ఓటరు జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని సూచించారు.



మాట్లాడుతున్న రాంప్రసాదరావు

### వాహనాల వేలం



వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

**కాటారం :** కాటారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బుధవారం మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయం ఆవరణలో ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ లింగచారి పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. తొమ్మిది వాహనాలకు వేలం వేయగా పలువురు పాల్గొని వాహనాలను దక్కించుకున్నారు. వేలం ద్వారా రూ.1,32,600 నగదు, రూ.17,508 జీఎస్టీ సొమ్ము ఎక్సైజ్ శాఖకు ఆదాయం సమకూరినట్లు అసిస్టెంట్ సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ఎక్సైజ్ శాఖ కాటారం ఎస్సై కిష్టయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

### అడవికి నిప్పుపెట్టొద్దు

- ఎఫ్‌ఎస్‌ఓ నారాయణ

**వాజేడు :** అడవుల్లో పెరిగే చెట్లతోనే ప్రజలకు, ఇతర జీవాలకు స్వచ్ఛమైన గాలి అందుతుందని ఎఫ్‌ఎస్‌ఓ నారాయణ అన్నారు. మండల పరిధిలోని చెరుకూరు సెక్షన్‌లోని లక్ష్మీపురంలో బుధవారం స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నా రాయణ మాట్లాడుతూ ఇప్ప పువ్వులు, చీపురు పుల్లలు సేకరించేందుకు అడవి వెళ్లిన వారు చెట్లకింద సేద తీరే సమయంలో పొరపాటున నిప్పు పెట్టొద్దన్నారు. అడవిలో మంటలు చెలరేగితే స్థానికులు అటవీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో పాటు మంటలను ఆర్పే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**వాజేడు :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మాధురి ప్రభుత్వ బ్యాంకుల ద్వారా లబ్ధి పొందే పథకాల ప్రయోజనాలను వివరించారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతిబీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ఆన్‌లైన్ మోసాలు, కేవైసీ, ఈకేవైసీ పై అవగాహన కల్పించారు.

# వార్డెన్, సిబ్బందిని సస్పెండ్ చేయాలి

**మొగుళ్లపల్లి :** హాస్టల్ వార్డెన్, సిబ్బందిని సస్పెండ్ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు దూడపాక రాజు, ఉపాధ్యక్షుడు బండారి కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న టేకుమట్ల మండలం పంగిడిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి పురాణం సంతోష్ చలివాగులో పడి మృతిచెందాడని పేర్కొన్నారు. సంతోష్ మరణానికి హాస్టల్ వార్డెన్, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని చెప్పారు. ఎస్సీ, బీసీ హాస్టల్‌లో ఉన్న విద్యార్థులను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని వారు విమర్శించారు. హాస్టల్స్ వార్డెన్స్ స్థానికంగా ఉండడం లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హాస్టల్ వార్డెన్, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు చేయండి

**గోవిందరావుపేట :** రెడ్డి కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల సంఘం నాయకులు బుధవారం పస్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజ్యాంగం ద్వారా ఎన్నుకోబడి అన్ని కులాలను సమాన దృష్టిలో చూడాల్సిన బాధ్యతను మరచి ఒక రెడ్డి వర్గాన్ని టార్గెట్ చేసుకోని వివాదస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదు అని రెడ్డి సంఘం నాయకులు మండిపడ్డారు. వెంటనే రెడ్డి కులస్తులకు తీన్మార్ మల్లన్న బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి, లింగా రెడ్డి, సత్యనారయణ రెడ్డి, యాదగిరి రెడ్డి, రవీందర్ రెడ్డి, సాంబశివరెడ్డి, ఎల్లారెడ్డి, పూలమ్మ, రమాదేవి, సంధ్యారాణి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

**రెడ్ల మనోభావాలను దెబ్బతీశాయి**

**ములుగు :** బీసీ గర్జన సభలో తీన్మార్ మల్లన్న మాట్లాడిన విధానం రెడ్ల మనోభావాలను దెబ్బతీశాయని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు వేముల సమ్మిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం జరిగిన సంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ స్థాయిలో ఉండి రాజ్యాంగానికి విరుద్ధమైన పదజాలంతో మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. తీన్మార్ మల్లన్న బేషరతుగా రెడ్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుమ్మ పిచ్చిరెడ్డి, పల్లె జయపాల్‌రెడ్డి, చిన్నారెడ్డి, గట్ల శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాంరెడ్డి, చెంచురెడ్డి పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

# మహాసభలను విజయవంతం చేయాలి

**ఏటూరునాగారం :** ములుగులో ఈనెల 12వ తేదీన నిర్వహించే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా రెండో మహాసభను జయప్రదం చేయాలని ఏఐకేఎస్ రాష్ట్ర నాయకుడు రవీందర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏఐకేఎస్ కార్యాలయంలో మండల నాయకుడు గోగు సీతారాములు అధ్యక్షతన జరిగిన సంఘం సన్నాహక సమావేశంలో రవీందర్ పాల్గొని మాట్లాడారు. ములుగు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగే సంఘం ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని రైతులకు కోరారు. రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు కనీస మద్దతు ధరలు కల్పించే చట్టం చేయాలని ఢిల్లీ కేంద్రంగా రైతు నాయకుడు గుర్మీత్ సింగ్ దల్లేవాల అమరణ నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ మోదీ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పైగా ఆ ఉద్యమాలకు ఇతరత్రా సంఘ వ్యతిరేక శక్తులతో సంబంధాలు ఉన్నాయనడం సిగ్గుచేటని అన్నారు.

# కులగణన దేశానికి రోల్ మోడల్



భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ నాయకుల సంబురాలు



టేకుమట్ల: బాణసంచా కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దేవన్

**భూపాలపల్లి రూరల్ :** కులగణన రిజర్వేషన్ అసెంబ్లీలో ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దేవన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా దేవన్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టి దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం కులగణన చేయాల్సిన అవసరం ఉన్న కూడా తుంగలో తొక్కి బడుగు, బలహీన వర్గాలకు తీరని అన్యాయం చేశారన్నారు. చట్టం ప్రకారం రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చే పరిస్థితి లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలలో 42శాతం బీసీలకు టికెట్లు ఇస్తామని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజాల రవీందర్, నాయకులు చల్లూరి మధు, క్యాతరాజు సాంబమూర్తి, పైడిపల్లి రమేష్, ముంజాల రవీందర్, పిల్లలమర్రి నారాయణ, గురజాల రవి,పుల్ల మహేష్, నాగపురి సమ్మయ్య గౌడ్, రమణాచారి, గన్నారపు రమేష్, కావేటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నాయకుల సంబురాలు**

**టేకుమట్ల :** బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తు బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ ఆధర్యంలో సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా బీసీలు ఎదురు చూస్తున్న కుల గణన, ఎస్సీల వర్గీకరణపై చట్టబద్ధత తీసుకురావడం చారిత్రకం అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వైనాల రవీందర్, బండ శ్రీకాంత్‌పాణి, మాదం కొమురయ్య, బండి రవి, శాస్త్రాల కిరణ్, కత్తి సంపత్, దొంతుల శ్రీనివాస్, క్రాంతి, అనిల్, కొయ్యల చిరంజీవి, పొలుదాసరి రాజేశం, బోండ్ల మహేష్, పాల్గొన్నారు.

**కాటారం :** బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను హర్షిస్తూ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు నిర్వహించారు. ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఫొటోగ్రాఫర్స్ డైరీ ఆవిష్కరణ

**రేగొండ :** మండలంలోని పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఫొటోగ్రాఫర్స్ డైరీని బుధవారం ఎస్సై సందీప్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా నేటి ఫొటోగ్రాఫర్లు తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమగ్ర సమాచారంతో డైరీని రూపొందించిన ఫొటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ మండల అధ్యక్షుడు జంబుల రఘు, ప్రధాన కార్యదర్శి రాజేందర్ నాయక్, కోశాధికారి బండి కమలాకర్, సభ్యులు వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్సై సందీప్‌కుమార్